నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

3 | నిజామాబాద్, గురువారం 24 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL


## కేసీఆరే శ్రీరామ రక్ష



నిర్మల్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ) : పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి తర్వాత ఈ 16 నెలల కాంగ్రెస్ పాలనలో మళ్లీ పదేండ్లు వెనకబడి పోయామని ప్రజలు ఆవేదన చెందుతున్నరు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మి మోసపోయామని ప్రజలకు అర్థమైంది. స్వయంగా కాంగ్రెస్ నాయకులే గ్రామాల్లో తాము కాంగ్రెస్ నాయకులమని చెప్పుకునే పరిస్థితి లేదు. తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్ష అని ప్రజలు భావిస్తున్నరు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులతో పాటు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఖానాపూర్ నియోజక వర్గం నుంచి నాలుగు వేల మందిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. తెలంగాణను కంటికి రెప్పలా కాపాడుకునే నాయకుడు కేసీఆరే అని, ఆయనకు అండగా ఉండి భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతి గుండే వరంగల్ వైపు చూస్తున్నది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలకు కేసీఆరే శ్రీరామ రక్ష అని తేలిపోతుంది. 13 ఏళ్లపాటు స్వరాష్ట్రం కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి తెలంగాణ సాధించుకున్నం. సాధించుకున్న తెలంగాణలో పదేండ్లు బీఆర్‌ఎస్ పాలన అద్భుతంగా సాగింది. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాయి. దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చిన ఏకైక నాయకుడు కేసీఆర్. ఈ కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రికి తెలంగాణ అంటే ప్రేమ లేదు. మాటలు చెప్పుడు, మోసం చేసుడు ఒక్కటే తెలుసు. తెలంగాణ పదాన్ని కూడా పలకడానికి ఇష్టపడని పార్టీ అది. అలాంటి పార్టీకి, పాలనపై అనుభవం లేని వ్యక్తి చేతిలో రాష్ట్రాన్ని పెడితే కుక్కలు చింపిన విస్తరిలా తయారైంది. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్ ప్రాంతంలో తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకక ప్రజలు గోస పడుతున్నరు. వచ్చే రెండు, మూడు వారాల్లో తాగునీటి సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంది. కేసీఆర్ పాలనలో తాగునీటి కోసం ప్రజలు ఏనాడు ఇబ్బంది పడలేదు.

**- భుక్యా జాన్సన్ నాయక్,**
**ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయ కర్త**

## ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్..

నిర్మల్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 16 నెలల కాలంలోనే అట్టర్ ఫ్లాప్ అయింది. అమలు కాని అనేక హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన సందర్భంగా జరుగుతున్న ఈ రజతోత్సవ సభకు ప్రజల నుండి విశేష స్పందన వస్తున్నది. మేము నిర్మల్ నియోజకవర్గం నుంచి 3 వేల మందిని తీసుకెళ్దామనుకుంటే 10 వేల మంది రావడానికి సిద్ధంగా ఉన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజలు నిరాశ, నిస్పృహతో ఉన్నారు. రుణమాఫీ జరగక రైతుబంధు రాక రైతులు ఈ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం, మహాలక్ష్మి పేరిట మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఇవ్వకపోవడంతో మహిళలు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్.. ప్రజలకు ఇవ్వని హామీలను అమలు చేశారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు, బాలింతలకు కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, హాస్టల్‌లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన భోజనం ఇలా అనేక కార్యక్రమాలను ప్రజల అవసరాన్ని బట్టి అమలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ 16 నెలల్లో కొత్తగా ఒక్క పథకం కూడా మొదలు పెట్టలేదు. 420 హామీలిచ్చి నాలుగు హామీలు కూడా నెరవేర్చని ఈ ప్రభుత్వంపై ప్రజల్లో చాలా ఆగ్రహం ఉంది. ఆ ఆగ్రహంతోనే కేసీఆర్ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరు.



**- కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి, నిర్మల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్త**




# రజతోత్సాహం

## 25 ఏండ్ల పండుగకు సిద్ధమైన పార్టీ శ్రేణులు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి తరలివెళ్లనున్న వేలాది మంది
- ఆది నుంచి ఉద్యమ పార్టీతోనే ఆదిలాబాద్ జిల్లా
- పార్టీ శ్రేణుల్లో జోష్ నింపనున్న కార్యక్రమాలు

## వరంగల్ సభతో రెండు పార్టీల ఖేల్ ఖతం

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభతో కాంగ్రెస్, బీజేపీల దుకాణం బంద్, ఖేల్ ఖతం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను పూర్తిగా విస్మరించింది. గ్రామాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం రైతుల పండించిన పంటలను కొనుగోలు చేయడం లేదు. రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2500 లేవు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలకు నిధులు ఇవ్వడం లేదు. తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగం వినడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రెండు పార్టీలు ఇప్పటికే ప్రజల విశ్వాసం కోల్పోయాయి. రజతోత్సవ సభ అనంతరం కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉండదు.

**- జోగు రామన్న,**
**బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి**



## కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు..



నిర్మల్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ) : సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో మన తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా కరెంటు కోసం జరిగిన ఆందోళనలో అప్పటి ప్రభుత్వం కాల్పులకు పాల్పడి ప్రజల ప్రాణాలను తీసిన ఘటన కేసీఆర్‌ను కలిచివేసింది. దీంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే మన కరెంటు, మన నీళ్లు, మన నిధులు మనకు దక్కుతాయన్న ఆలోచనతోనే పదవులను త్యాగం చేసి కేసీఆర్ టీఆర్‌ఎస్ పార్టీని ప్రారంభించారు. ఆ తర్వాత అనేక రకాల పోరాటాల ద్వారా అన్ని వర్గాలను ఏకం చేసి రాదు అనుకున్న తెలంగాణను చావు నోట్లో తల పెట్టి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత బీఆర్‌ఎస్ పాలనలో దేశంలోనే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తేవాలన్న ఆకాంక్షతో అనేక రకాల పథకాలకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ కార్యక్రమాలతో పదేళ్లపాటు రాష్ట్ర ప్రజలు సుఖ,సంతోషాలతో గడిపారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రైతు ఆత్మహత్యల నివారణకు పెట్టుబడి అందించడం ఒక్కటే మార్గమని భావించిన కేసీఆర్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చారు. అలాగే కరెంటు కష్టాలను దూరం చేసి వ్యవసాయానికి 24 గంటల కరెంటును అందించారు. అనేక కొత్త ప్రాజెక్టులను కట్టడంతో రైతు ముంగిటికే పుష్కలంగా సాగునీటి వనరులు అందుబాటులోకి వచ్చాయి. పండిన పంటలకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో రాష్ట్రంలోని రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ ఒక అన్నపూర్ణ రాష్ట్రంగా మారి దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగింది. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారు. ఈ 16 నెలల కాలంలోనే తాము తప్పు చేశామని, కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయామని ప్రజలకు తెలిసిపోయింది. అందుకే ఈనెల 27న జరిగే రజతోత్సవ సభలో ప్రజలు మరోసారి మోసపోవద్దని కేసీఆర్ పిలుపునివ్వనున్నారు.

**- డాక్టర్ పడకంటి రమాదేవి,**
**ముథోల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్త**

### భారత రాష్ట్ర సమితి

*(బీఆర్‌ఎస్) రజతోత్సవ సభ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపనుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పుట్టి ఎన్నో ఏండ్ల ఉద్యమ ప్రస్థానం సాగించి.. ఆటుపోటన్లు ఎదుర్కొని స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన బీఆర్‌ఎస్ పార్టీ 25 ఏండ్ల ఆవిర్భా వ పండుగకు సిద్ధమైంది. ఈ సభను పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అధినేత కేసీఆర్ స్వయంగా అన్ని జిల్లాల పార్టీ నాయకులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. 1,300 ఎకరాల భారీ విస్తీర్ణంలో లక్షలాది మందితో సభ నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా నెల రోజుల నుంచి అన్ని జిల్లాల్లో పార్టీ విస్తృత కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నది. తొలుత ప్రతి నియోజకవర్గంలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. వాల్ రైటింగ్‌లు, నాయకులతో నిత్యం సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ రజతోత్సవ పండుగను విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని నియో జకవర్గాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో నూతన జవసత్వాలు, కొత్త ఉత్సా హాన్ని నింపాయి. అదే ఉత్సాహంతో ఈ నెల 27వ తేదీన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వ హించే సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వేలాది మంది కార్యకర్తలు, నాయకులు, అభి మానులు తరలివెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 25 ఏండ్ల బీఆర్‌ఎస్ ప్రస్తానం ఎలా సాగింది. రానున్న రోజుల్లో పార్టీ ఎలాంటి కార్యాచ రణతో ముందుకు వెళ్లనుందన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.*

*- మంచిర్యాల, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

## ముందు నుంచి బీఆర్‌ఎస్‌కు తోడు

తెలంగాణ ఉద్యమ పార్టీ బీఆర్‌ఎస్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ముందు నుంచి తోడుగా నిలిచారు. 2001లో పార్టీ ఆవిర్భావం అనంతరం 2004 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసింది. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో 28 సీట్లలో బీఆర్‌ఎస్ జయకేతనం ఎగురవేయగా, ఉమ్మడి జిల్లా నుంచి బోథ్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ గెలుపొందింది. అదే సమయంలో ఆదిలాబాద్ ఎంపీ సీటును కైవసం చేసుకుంది. రాష్ట్ర సాధన కోసం అధినేత కేసీఆర్ నాడు పార్టీ నుంచి గెలుపొందిన నాయకులను రాజీనామా చేయాలని కోరగా.. ఎంపీ సహా, ఖానాపూర్ ఎమ్మెల్యే కేసీఆర్ నిర్ణయాన్ని గౌరవిస్తూ రాజీనామాలు చేశారు. మిగిలిన రెండు నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యే అసమ్మతి వర్గంగా నిలిచిపోయారు. ఉప ఎన్నికల్లో ఎంపీ సీటుసహా ఖానాపూర్ ఎమ్మెల్యే సీటును బీఆర్‌ఎస్ కోల్పోయింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పార్టీకి గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. కానీ.. తెలంగాణ ఉద్యమం ముందు అవేవి పని చేయలేదు. ఉద్యమ కాలంలో బీఆర్‌ఎస్ పార్టీలోకి భారీగా నాయకులు వలస వచ్చారు. 2014లో తెలంగాణ ఏర్పడ్డాక జిల్లాలో పార్టీకి తిరుగులేకుండా పోయింది. స్వరాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఏడు స్థానాల్లో పార్టీ గెలుపొందింది. నిర్మల్, సిర్పూర్ నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఇక మిగిలిన ఒక్క ముథోల్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే కొన్ని రోజులకు బీఆర్‌ఎస్‌లో చేరారు. అలా పది అసెంబ్లీ స్థానాల్లో అన్నింటిలోనూ బీఆర్‌ఎస్ పాగా వేసింది. అనంతరం 2019లో జరిగిన ఎన్నికల్లో తొమ్మిది స్థానాల్లో బీఆర్‌ఎస్ జయకేతనం ఎగురవేసింది. ఆసిఫాబాద్ నుంచి గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్‌ఎస్‌లో చేరారు. అలా పదేండ్లు ఉమ్మడి జిల్లాలో పార్టీ వెలుగు వెలిగింది. కానీ.. 2023 ఎన్నికల్లో ప్రజా తీర్పు మరోలా వచ్చింది. తెలంగాణలో పార్టీ అధికారం కోల్పోయినప్పటికీ ప్రజల్లో బీఆర్‌ఎస్ నమ్మకం మాత్రం సడల్లేదు. తెలంగాణలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారు.

## జోష్ పెరగనుంది..

ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ అనేది తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 2001లో పార్టీ ఆవిర్భావానికి ముందు తెలంగాణ ప్రాంతంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో.. ఇప్పుడు దాదాపు అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పంట పొలాలు ఎండిపోతున్నాయి. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరెంట్ కోతలు మళ్లీ పునరావృతం అవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుత పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదు. ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైంది. ఇదే సమయంలో ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ అలుపెరగని పోరు చేస్తున్నది. తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ఎక్కడికక్కడ నిలదీస్తున్నది. అధికార పార్టీ భూ దాహానికి అడ్డుపడుతూ.. లగచర్ల బాధితులకు అండగా నిలిచింది. హైడ్రా పేరుతో చేసిన విధ్వంసానికి బలైపోయిన బాధితుల పక్షాన వకాల్తా పుచ్చుకున్నది. మొన్నటికి మొన్న హెచ్‌సీయూ భూముల్లో అటవీ విధ్వంసాన్ని అడ్డుకోడంలో కీలక పాత్ర పోషించింది. తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదంటూ పార్టీ ముందుకు వెళ్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభపై యావత్ తెలంగాణ ప్రత్యేక దృష్టి సారించింది. సభ అనంతరం నిరంతర కార్యక్రమాలతో బీఆర్‌ఎస్ ప్రజల్లో ఉండేందుకు, ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ మరింత పెరగనుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కొవ్వొత్తులతో నిరసన



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హిందూ వాహిని నాయకులు

భైంసా, ఏప్రిల్ 23 : కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా హిందూ వాహిని ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లో బుధవారం కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇందులో నాయకులు చింతపండు మహేశ్, నారాయణ రెడ్డి, ఆకుల రంజిత్, రాము, మల్లేశ్, సాయినాథ్, గాలి రాజు, ప్రవీణ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్ పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి మాస్క్‌తో నిరసన

*బాసర ఆర్జీయూకేటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న నిరసన బుధవారానికి 15వ రోజుకు చేరింది. దీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఉన్న మాస్క్‌ను ధరించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఎం చొరవ తీసుకుని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న 1200 కాంట్రాక్టు ప్రొఫెసర్ల జీవితాలను ఆదుకోవాలని కోరారు. కృష్ణప్రసాద్, అజయ్, రాకేశ్ రెడ్డి, శ్రీకాంత్, కుమార్ రాగుల, ఖలీల్, వహీద్, రవికుమార్ గౌడ్, సృజన, శ్వేత, దేవరాజు, శ్రీనివాస్, కాశన్న, వినయ్ పాల్గొన్నారు. - బాసర, ఏప్రిల్ 23*



సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఉన్న మాస్కులతో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన



నార్నూర్ ఉప మార్కెట్‌లో జొన్న కొనుగోళ్లను ప్రారంభించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

నార్నూర్, ఏప్రిల్ 23 : ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం నార్నూర్‌లోని ఉప మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభంతోపాటు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నార్నూర్, గాదిగూడ మండలాలను కలిసి శాశ్వత మార్కెట్ యార్డుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం ఇంకెప్పుడు ఇస్తారో వేచి చూడాల్సిందే అన్నారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోయం మారుతి, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఇనూస్ అక్బానీ, డైరెక్టర్ దుర్గే కాంతారావు, జాదవ్ విలాశ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మెస్రం హన్మంత్‌రావు, లోకండే దేవ్‌రావు, రాథోడ్, బిక్కు, తదితరులున్నారు.



## భారీ అగ్ని ప్రమాదం

**మూడు వాహనాలు, పశువుల పాక దగ్ధం**

తాంసి, ఏప్రిల్ 23 : కప్పర్ల గ్రామంలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. గ్రామ సమీపంలోని బొమ్మిని బుచ్చన్నకు చెందిన పశువుల పాకలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పెద్ద ఎత్తున విస్తరించాయి. గమనించిన స్థానికులు అందులో ఉన్న ఎడ్లను బయటకు తీసుకెళ్లారు. అనంతరం మంటలు అదుపు చేయాలని ప్రయత్నం చేసినప్పటికీ గంద్రత్ అభిలాష్, దారట్ల ప్రవీణ్‌కు చెందిన రెండు మహీంద్రా మాక్స్ అగ్నికి ఆహుతి కాగా మరో మహీంద్రా మాక్స్ స్వల్పంగా కాలింది. విషయం తెలుసుకున్న ఎస్సై రాధిక ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టి బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా తాంసి ఆర్ఐ ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

◄ కాలుతున్న మహీంద్రా మాక్స్ వాహనాలు